# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



మూడు గంటల కరెంటుతో పొలాలు ఎండుడే..

# కాంగ్రెస్‌ను నమ్మితే.. చిప్ప 'చేతి'కే..

- పంట పండదు..పెట్టుబడీ రాదని రైతుల ఆవేదన
- అప్పులబాధతో మళ్లీ ఆత్మహత్యలు మొదలయ్యే ప్రమాదం
- 10 హెచ్‌పీ మోటర్లు నడ్వవు..
- అదనపు ఖర్చులు పెట్టించాలని చూస్తున్న కాంగ్రెసోళ్లు..
- సీఎం కేసీఆర్ ఇచ్చే 24గంటల కరెంటే చాలు..
- మార్పులు వద్దు.. కాంగ్రెస్‌ను రానివ్వొద్దని స్పష్టం చేస్తున్న రైతాంగం

## కేసీఆర్ సార్ అచ్చినంకనే కరెంటు కష్టాలు పోయినయ్..



సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటలు కరెంటు ఇచ్చుడుతోటి రందిలేకుండా పోయింది. కాంగ్రెస్ నాయకులు కరెంటు విషయంలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. పొరపాటున కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే మళ్లీ కష్టాలు తప్పవు. సంతోషంగా ఉన్న జీవితాల్లో మళ్లా కష్టాలు కొని తెచ్చుకున్నేడే అయితది. కాంగ్రెసోళ్లను రైతులు ఎవరూ నమ్మరు. కష్టాలు తీర్చిన కేసీఆర్‌కే అండగా నిలబడతాం.

-గంగాధర్, రైతు, నర్సింగ్‌పల్లి

## పొలాలకు 10 హెచ్‌పీ మోటర్లు ఎట్లా సాధ్యం



చిన్న, సన్నకారు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు ఏర్పాటు చేసుకోవడం ఎలా సాధ్యమవుతుంది. 10 హెచ్‌పీ మోటర్లు అయితే మూడు గంటల కరెంటు సరిపోతుందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. లక్షలు ఖర్చు చేసి ఒకటి రెండు ఎకరాల రైతులు 10 హెచ్‌పీ మోటర్లు ఎట్లా పెట్టుకుంటారు. కాంగ్రెస్ గవర్నమెంట్ వస్తే సన్న, చిన్నకారు రైతులకు ఇబ్బందులు తప్పవు. బీఆర్‌ఎస్ పాలనలో 24 గంటల కరెంట్ వస్తుంటే హాయిగా ఎప్పుడంటే అప్పుడు మోటరు చాలు చేసుకొని పొలం తడుపుకుంటున్నాం. కాంగ్రెస్ గెలిస్తే మన లాంటి చిన్న రైతులకు కష్టాలు తప్పవు. సన్న, చిన్నకారు రైతులు మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలి.

-చందర్, రైతు, ముదక్‌పల్లి

## కాంగ్రెస్ హయాంలో నా ఇంటాయన సచ్చిపోయిండు



కాంగ్రెస్ హయాంలోనే మా ఇంటాయన సచ్చిపోయిండు. అప్పట్ల రాత్రిపూట కరెంటు ఇచ్చుడుతోటి పొలానికి నీరు పెట్టేతందుకు పోయిండు. బోరు చాలు చేస్తుండగా పాము కరిచి అడనే సచ్చిపోయిండు. అప్పుడే మంచి కరెంటు ఇస్తే మా ఇంటాయన సచ్చిపోయేటోడు కాదు. కాంగ్రెసోళ్లు అస్తే మళ్లా కరెంటు కష్టాలు తప్పవు. మళ్లా రైతులు తెల్లందాక పొలాల పొంటి ఉరకవడతది. అందరూ ఆలోచన జేయాలె.

-పోసాని, మంచిప్ప, మోపాల్ మండలం

## కాంగ్రెస్ వస్తే బిచ్చమెత్తుకునుడే..



కాంగ్రెస్ హయాంలో అడుగడుగునా కరెంటు కష్టాలే. అర్ధరాత్రి పొలానికి నీళ్లు పట్టేతందుకు వెళ్లి ఎంతోమంది సచ్చిపోయిండ్రు. తెలంగాణ వచ్చిన తరువాత ఎలాంటి ఇబ్బందులు లేవు. 24 గంటల కరెంటు ఇవ్వడంతో అర్ధరాత్రి వెళ్లాల్సిన అవసరం లేదు. ఎరువులు, రైతు బంధు, రైతు బీమా ఇచ్చి కేసీఆర్ సారు ఆదుకుంటున్నారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే నెలల సమయం పట్టేది. మళ్లీ కాంగ్రెస్ వస్తే బిచ్చం ఎత్తుకునేడే అయితది. ఆ బాధలు రావొద్దంటే మళ్లీ కేసీఆర్ సార్‌నే గెలిపించుకోవాలి.

-గంగాధర్, మంచిప్ప, మోపాల్ మండలం


## మూడు గంటలతోటి గడ్డి కూడా పెంచలేం



సీఎం కేసీఆర్ అచ్చిన కాడి నుంచి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. తీరం లేకుండా 24 గంటలు కరెంట్ ఇచ్చుడుతోటి బంగారు పంటలు పండించుకుంటున్నాం. పంటలకు నీళ్లు పారిచ్చేందుకు తెల్లందాక బాయిలకాడికి, బోర్లకాడికి పోయే బాధ తప్పింది. కరెంట్ తిప్పలు లేకపోవుడుతోటి గుంట పొలం కూడా వదలకుండా పంటలు పండిస్తున్నాం. 24 గంటల కరెంట్‌ను 3 గంటలకు తగ్గించినట్లయితే గొడ్డు, గోదాకు గడ్డి కూడా పెంచే పరిస్థితి ఉండదు. ఎన్నడో పోయిన కరెంట్ బాధలను మళ్ల తీసుకొస్తామంటున్న పార్టీలను రైతులు, రైతు కూలీలు, రైతు కుటుంబాల ఆదరించవు. బీఆర్‌ఎస్‌తోనే మాలాంటి రైతులకు భరోసా.

-రాములు, రైతు, నర్సింగ్‌పల్లి

## 3 గంటల కరెంట్ సరిపోదు



3 గంటల కరెంట్‌తో మా పొలాలు సాగు కావు. కాంగ్రెస్ నాయకులు చెప్పినట్లు మూడు గంటల కరెంట్‌తో రైతులు బాగుపడరు. మాకు 3 ఎకరాల పొలం ఉంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటలు కరెంట్ ఇవ్వడంతో 5 హెచ్‌పీ మోటర్లను వాడుతున్నాం. కాంగ్రెస్ 3 గంటల కరెంట్ ఇస్తాం.. రైతులు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నారు. రైతులందరూ ఒకేసారి 10హెచ్‌పీ మోటర్లను వేస్తే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోతాయి. మా రైతులకు సర్కారు ఇచ్చే ట్రాన్స్‌ఫార్మర్లు 25 హెచ్‌పీవి ఉంటాయి. ఇప్పుడు తెలంగాణ సర్కారు 24 గంటల కరెంట్ ఇస్తుంది. పంటలు మంచిగా పండుతున్నాయి. దిగుబడి మంచిగా వస్తుంది.

-ముత్యం రెడ్డి, రైతు, సిర్‌పూర్

## కాంగ్రెస్‌వి తప్పుడు మాటలు..



గతంలో నీళ్లు, కరెంటు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. ఆ విషయం అందరికీ తెలుసు. కరువు వచ్చినప్పుడు ఏ పార్టీ వచ్చి ఆదుకోలేదు. తెలంగాణ వచ్చిన తరువాతనే నీళ్లు వచ్చినాయి. రాత్రి పూట పొలాలకు నీరు పారిచ్చేతందుకు పోతే ఇంటికి వస్తామో.. రామో తెలియని పరిస్థితి ఉండేది. సీఎం కేసీఆర్ అనుకున్నది సాధించిండు. ఏ రాష్ట్రంలో లేని విధంగా 24 గంటల కరెంట్, రైతు బంధు ఇస్తుంటే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నది. ఎరువులు అందుబాటులో ఉంచి పంటలకు మద్దతు ధర ఇస్తున్నారు. ఏరికోరి మళ్లా ఆ బాధలు తెచ్చుకోవద్దు.

-రాజిరెడ్డి, రైతు, బాడ్సి

## అప్పటి కరెంటు కష్టాలు మళ్లీ వద్దు



అప్పటి కరెంట్ కష్టాలు మళ్లీ రావద్దు. రాత్రి పూట పొలాల కాడ పండుకునేటోళ్లం. కరెంట్ ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెల్వదు. దీంతో అక్కడే కావలి కాసేటోళ్లం. రాత్రిపూట ఇచ్చే కరెంట్‌తో గ్రామంలో చాలా మంది రైతులు నీళ్లు పెట్టేందుకు పోయి కరెంట్ షాక్‌తో, పాము కాటుకు గురై చనిపోయారు. కరెంట్ సరిగా రాక పంటలు ఎండిపోయేవి. ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తుండడంతో రైతులు అవసరం వచ్చినప్పుడల్లా నీళ్లు పారించుకుంటున్నారు. రెండు పంటలు పండిస్తూ రైతు రాజుగా జీవిస్తుండు. పుట్ల కొద్ది వడ్లు పండుతున్నాయి. మళ్లీ కాంగ్రెస్ వస్తే పొలాల దగ్గరే పండుకోవాలి. ఆ కష్టం మళ్లీ మాకు వద్దు.

-సత్యనారాయణ, రైతు, కంజర

## ఓర్వలేక కాంగ్రెస్ కుట్రలు



తెలంగాణ వచ్చిన తరువాత చాలా అభివృద్ధి చెందింది. అందుకే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీఆర్‌ఎస్ మీద పడ్డాయి అనేక సంక్షేమ పథకాలు ఇస్తున్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. రైతులు 10హెచ్‌పీ మోటర్లు ఎక్కడా వాడరు. రైతులను నాశనం చేసే పనులు చేయవద్దు. రైతుల గురించి ఆలోచన చేస్తున్న బీఆర్‌ఎస్‌కే అందరూ అండగా నిలబడాలె.

మోహన్ రెడ్డి, రైతు, మంచిప్ప

## మూడు గంటలు అయితే మునుగుడే



రేవంత్ రెడ్డి చెప్పినట్లు మూడు గంటల కరెంట్ అయితే రైతులు నిండా మునగక తప్పదు. సోయి ఉండి మాట్లడుతున్నాడో లేక మాట్లడుతున్నాడో తెలియడం లేదు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుడంటే అయ్యే పని కాదు. రైతులను ఆగం చేసుడు తప్ప మరేమీ లేదు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇట్లనే చేసింది. రోజుకు రెండు మూడు గంటలు కరెంటు ఇచ్చుడుతోటి వ్యవసాయంతో పాటు చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. సీఎం కేసీఆర్ కృషితో పూర్తిగా కోలుకుంటున్న సమయంలో కాంగ్రెస్ వాళ్లు ప్రజలకు మాయ మాటలు చెప్పుడు మొదలు పెట్టిండ్రు. ఆళ్ల మాటలు నమ్మితే నిండా మునుగుడే.

మెచ్చ నారాయణ, రైతు, బాడ్సి

## దొంగ మాటలు చెప్పుడు బంద్ చేయాలి



గ్రామాల్లో ఎన్ని మోటర్లు ఉన్నాయో తెలుసా రేవంత్ రెడ్డి. ఒక్క మోటరుకు 50 వేల రూపాయాలు అవుతుంది. దానికి ఎంత ఖర్చు అవుతుంది. ఎంత కరెంట్ బిల్లు వస్తుందో అవగాహన లేకుండా మాట్లడుతున్నాడు. తెలంగాణ వచ్చిన తరువాత ప్రశాంతంగా ఉన్నాం. 24 గంటల కరెంట్ వస్తుంది. రాత్రి పోయే పరిస్థితి లేదు. రైతు బంధు, రైతు బీమా వస్తుంది. ఎరువులు ఇస్తున్నారు. పచ్చగా ఉన్న గ్రామాల్లో రేవంత్ రెడ్డి మళ్లీ చిచ్చుపెట్టాలని చూస్తుండు. ఈ బుద్ధి కాంగ్రెస్ పరిపాలనలో ఏమైంది. కర్ణాటకలో ఎందుకు ఇవ్వడం లేదు. మాయ మాటలు చెప్పడానికి వస్తున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.

-మైసన్న, రైతు, మంచిప్ప

## మళ్లా మా బతుకులు ఆగం జేసుకోం..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ కరెంట్ కష్టాలు తప్పవు. అప్పట్ల కరెంట్‌తోని గోస పడ్డది అప్పుడే మరిచిపోతమా? కరెంట్ కోసం రాత్రిళ్ల టార్చిలైటు పట్టుకుని బాయిల కాడ కావలి ఉండేటోళ్లం. అయినా ఇట్ల అచ్చినట్టు అచ్చిదాని పాడుగాను కరెంట్ బందయ్యేది. మళ్లా కరెంటు కోసం కావలి కాసేది. ఆ రోజులు గుర్తొస్తేనే ఈపులో వణుకు పుడ్తది. తెలంగాణ వచ్చినంక 24 గంటలు కరెంటేనాయే. ఎప్పుడంటే అప్పుడు వచ్చి పంటకు నీళ్లు వదులుతున్నం. కాలిన మోటర్లను ట్రాక్టర్ల తీసుకెళ్లే బాధ లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లా కాంగ్రెస్‌కు ఓటేసి మా బతుకులను మేమే ఆగం జేసుకుంటమా.. రైతును బతికించిన బీఆర్‌ఎస్‌కే మా ఓట్లు.

-పోశెట్టి, రైతు, ముదక్‌పల్లి

## 3 గంటలు పనికిరాని మాట



కాంగ్రెసోళ్లు అన్నట్లు వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ ఇవ్వడమనేది పనికిరాని మాట. మూడు గంటల విద్యుత్ ఇస్తే మోటర్ల కెపాసిటీని పెంచాలి. అలా పెంచితే రైతులు పండించిన పంట మొత్తం మోటర్లు మార్చడానికి ఖర్చు చేయాల్సి వస్తుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవసాయానికి ఇస్తున్న 24 గంటల విద్యుత్ సరఫరానే కరెక్ట్. రైతులు ఉన్న మోటర్లతోనే నిరంతరం కరెంట్‌తో పంటలకు నీళ్లు పారించుకుంటున్నరు.

-సుబ్బ రావు, రైతు, ముదక్‌పల్లి